## క్లుప్తంగా

### ఉపాధి పనుల బకాయి చెల్లించాలి

చిలకలపూడి(మచిలీపట్నం): ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.పవన్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన డ్వామా ఏపీడీ ఎ.నాగమహేశ్వరరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. పవన్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా కార్మికులు గత రెండు నెలలుగా ఎండలో పనిచేయటం జరిగిందన్నారు. ఎనిమిది వారాల బిల్లుల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఆరు మాసాలుగా వ్యవసాయ పనులు లేకపోగా ఒకవైపు ఉపాధి పనులు వేతనాలు చెల్లించకపోవటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై స్పందించి వెంటనే బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనుల్లో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని, ప్రస్తుతం కొనసాగుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లను రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తొలగించకూడదన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హరిబాబు ఉన్నారు.

### రాయితీపై వరి విత్తనాల పంపిణీ



కోడూరు: ప్రభుత్వం రాయితీపై అందించే వరి విత్తనాలను బుధవారం రైతులకు పంపిణీ చేశారు. మండలంలోని పిట్టల్లంక గ్రామ సచివాలయం వద్ద బీపీటీ–5204 రకం వరి విత్తనాలను సర్పంచి కనగాల వెంకటేశ్వరరావు చేతుల మీదగా అందించారు. కేజీ విత్తనాల ధర రూ.41.80 కాగా సబ్సిడీ పోను రూ.36.80 వంతున రైతులకు అందిస్తున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. 25 కేజీల ప్యాకెట్‌కు రూ.125 సబ్సిడీ వస్తుందన్నారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత



కె. కొత్తపాలెం (మోపిదేవి): మండల పరిధిలోని కె.కొత్తపాలెంకు చెందిన మత్తి వరాలు అనారోగ్యంతో విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వం ఆమెకు అందించే వికలాంగుల పింఛన్ రూ.6 వేలు గ్రామ సచివాలయ రెవెన్యూ సర్వేయర్ శరత్, మత్తి వంశీ బుధవారం విజయవాడ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందించారు. వరాలు కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

### ఆకట్టుకున్న మహిళల జడ కోలాటం



కోడూరు: మండలంలోని కోడూరు తూర్పువైపు మహిళలు నిర్వహించిన జడ కోలాట భజనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామానికి చెందిన 30 మంది మహిళలు బృందంగా ఏర్పడి కోలాటాన్ని నేర్చుకున్నారు. మంగళవారం రాత్రి మహిళలంతా గ్రామంలోని రామాలయం వద్ద కోలాటం చేశారు. శ్రీకుకాళంకు చెందిన ఏడుకొండలు, కడవకొల్లు ఉదియమ్మ పర్యవేక్షణలో మహిళలు జడ కోలాటం నేర్చుకున్నారు. చేతికి తాడు కట్టుకొని మహిళలంతా వరుసక్రమంలో నిలబడి చిడతలతో కోలాటం చేసిన తీరు ఎంతగానో ఆకట్టుకుంది. ఈ ప్రాంతంలో మహిళలు జడ కోలాటం నేర్చుకొని ప్రదర్శించడాన్ని పలువురు అభినందించారు.

### వెండి వర్కర్‌పై కర్రలతో దాడి

కోనేరుసెంటర్: పాత తగాదాల నేపథ్యంలో ఓ వ్యక్తిపై ఇరువురు దాడి చేశారు. ఈ దాడిలో సదరు వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బాధిత కుటుంబం పోలీసులకు చేసిన ఫిర్యాదులో వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం బలరామునిపేట రాజీవ్‌నగర్‌కు చెందిన కొండ్రు అంజి వెండి పని చేస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన త్రినాథ్ అనే వ్యాపారి వద్ద పనికి చేరాడు. అయితే మూడుస్తంభాల సెంటర్‌కు చెందిన కొమ్ము పండు, గోవిందు అనే వారితో అంజికి గతంలో పలు గొడవలు జరిగాయి. దీంతో పండు, గోవిందు అంజిని పనిలో నుంచి పంపేయాలంటూ త్రినాథ్‌పై ఒత్తిడి చేయటం మొదలుపెట్టారు. త్రినాథ్ మీ మధ్య గొడవలు మాకెందుకంటూ విషయాన్ని అంతగా పట్టించుకోకపోవటంతో ఆగ్రహం చెందిన పండు, గోవిందు బుధవారం త్రినాథ్ ఇంటికి వెళ్లి అంజిపై కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో అంజి తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో చేరాడు. అంజిపై దాడి చేసిన ఇరువురు అంతటితో ఆగక ఇంటికి వచ్చి మహిళలు అని కూడా చూడకుండా తమ వాళ్లను కులం పేరుతో తిట్టి దుర్భాషలాడినట్లు ఆర్‌పేట పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కౌలు కార్డుల జారీకి రంగం సిద్ధం

- కాలం తీరిన కార్డుల స్థానంలో కొత్తవి జారీ
- గత ఏడాదిలో ఏప్రిల్‌లోనే మొదలు.. ఆగస్టు వరకు కొనసాగింపు
- పెడన నియోజకవర్గ వ్యాప్తంగా గతేడాది 6,500 ఫైగా అందజేత



పెడన: కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీకి రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఆయా మండలాల్లో కౌలు గుర్తింపు కార్డుల జారీపై సిబ్బంది దిశానిర్దేశం చేశారు. గత ఏడాది ఖరీఫ్‌కు ముందుగానే అంటే ఏప్రిల్‌లోనే గుర్తింపు కార్డులను జారీ చేశారు. ఆగస్టు వరకు కొనసాగించారు.

**ఈ సీజన్‌లో జాప్యం..**

ప్రస్తుతం ఈ ప్రక్రియ తీవ్ర జాప్యం ఏర్పడింది. కారణం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆలస్యం కావడంతో ఈ నెలలో ప్రక్రియ ప్రారంభించనున్నారు. గత ఏడాది జారీ చేసిన అన్ని కార్డుల కాల పరిమితి పూర్తయి ఉంటుందనే వాదన కూడా వినిపిస్తోంది. కారణం 11 నెలల కాలపరిమితికి మాత్రమే ఈ గుర్తింపు కార్డులు జారీ చేశారు. ఇప్పుడు కూడా ఇదే కాల పరిమితికి కార్డులను జారీ చేయనున్నారు.

**కౌలు రైతులకు మద్దతుగా నిలిచేలా..**

కౌలు రైతులకు మద్దతుగా నిలిచేలా వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుల చట్టం 2019 భూ యజమాని హక్కులకు ఎలాంటి నష్టం లేకుండా సాగు చేసే కౌలు రైతులకు పంట సాగుదారు కార్డు ఇవ్వాలని నిర్ణయించింది. సాగుదారు కార్డులిచ్చి ప్రభుత్వ మద్దతుగా ఆర్థిక చేయూత అందించడానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంట సాగుదారుల హక్కుల చట్టం తెచ్చింది. ఈ కార్డుపై సంతకం చేయడం వలన భూ యజమానులకు, వారి భూమిపై ఉన్న హక్కులకు ఎటువంటి భంగం కలుగకుండా 1956 రక్షిత కౌలుదారీ చట్టాన్ని రద్దు చేసింది. కొత్త చట్టంలో మరి కొన్ని జాగ్రత్తలు తీసుకుంది.

**నిశ్చింతగా ఉండేందుకే..**

ఈ చట్టం విషయంలో భూ యజమానులు నిశ్చింతంగా ఉండవచ్చని అప్పటి ప్రభుత్వం తెలిపింది. ఈ చట్టం అమల్లో భూ యజమానులు, కౌలు రైతులు ఒకరికి ఒకరు సహకరించుకోవాలని, గ్రామ వలంటీర్లు, వీఆర్వోలు ప్రోత్సహించాలని వ్యవసాయశాఖాధికారులు గత ఏడాది వరకు సూచనలు జారీ చేశారు. భూ యజమానుల హక్కులకు ఎలాంటి భంగం కలుగకుండా వారి హక్కుల రక్షణకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తూ సాగుచేసే రైతులకు పంట రుణం పొందానికి వీలుగా సాగుదారుల కార్డు మంజూరు చేసేందుకు కొత్త చట్టం తీసుకువచ్చింది.

**మార్చుతారా..లేక కొనసాగిస్తారా..**

కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో కౌలు గుర్తింపు కార్డులకు సంబంధించి మార్పులు చేర్పులు ఏమైనా చేస్తుందా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే బాగా జాప్యం నెలకొనడంతో ప్రస్తుత ఏడాదికి ఇలాగే కొనసాగించి వచ్చే ఏడాది నుంచి మార్పులు చేయడానికి అవకాశాలున్నాయనే వాదన కూడా వినిపిస్తోంది.

**కార్డు పొందడం ఎలా..**

సాగుదారు కార్డు భూ యజమానికి, సాగు చేస్తున్న రైతుకు మధ్య ఒప్పందాన్ని సూచిస్తోంది. కార్డుపైన భూ యజమాని (లేదా వారి ప్రతినిధి), సాగుదారు, గ్రామ పరిపాలనాధికారి (వీఆర్వో, ఆధరైజ్డ్ ఆఫీసర్) ఈ ముగ్గురు సంతకాలుండాలి. పంట సాగుదారు కార్డు కాల పరిమితి కేవలం 11 నెలలు మాత్రమే. 11 నెలలు తరువాత సాగుదారు మళ్లీ కొత్త కార్డు పొందాల్సి ఉంటుంది. రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించడం, తద్వారా వీఏఏను కలిసి కార్డుకు దరఖాస్తు చేయాలి.

**నియోజకవర్గ వ్యాప్తంగా 7,089 కార్డులు**

పెడన నియోజకవర్గ వ్యాప్తంగా 112 గ్రామాల్లోని 2022 ఖరీఫ్ సీజన్‌లో 7,089 మందికి సాగుదారు కార్డులను జారీ చేశారు. 2023 ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే అంటే మే నుంచి కార్డులను జారీ చేశారు. 6,588 కార్డులకు పైగా జారీ చేశారు. నిరుడు జూలై ప్రారంభం నుంచి జరిగిన జగనన్న సురక్ష క్యాంపులు ద్వారా కూడా చాలా మంది కౌలు రైతులకు సాగుదారు కార్డులను మంజూరు చేశారు.

**మండలాల వారీగా గత రెండేళ్లుగా సాగుకార్డులను పరిశీలిస్తే..**

| మండలం | 2022 | 2023 |
|---|---|---|
| బంటుమిల్లి | 1,365 | 1,218 |
| కృత్తివెన్ను | 1,015 | 920 |
| గూడూరు | 2,212 | 2,071 |
| పెడన | 2,497 | 2,379 |
| | 7,089 | 6,588 |

**అవగాహన కల్పిస్తున్నాం**



సాగుకార్డుల విషయంలో మొన్నటి వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. గత ఏడాది మే నుంచి ఈ సాగుకార్డులు జారీ చేశాం. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఎత్తి వేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కౌలు గుర్తింపు కార్డుల జారీకి చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందికి సూచనలు జారీ చేశాం. కాలపరిమితి తీరిన కార్డుల స్థానంలో కొత్తవి ఇవ్వాలని, కొత్తగా ఎవరైనా దరఖాస్తు చేసుకున్నా ఇవ్వాల్సిందిగా తెలియజేశాం.

–జీవీ శ్రీనివాసరావు, ఎంఏవో, పెడన మండలం

## రాహుల్ వ్యాఖ్యలకు బీజేపీ నిరసన



కోనేరుసెంటరులో నిరసన తెలుపుతున్న బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు

మచిలీపట్నంటౌన్: పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ హిందువులపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక బీజేపీ, అనుబంధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కోనేరుసెంటరులో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీతో పాటు విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, దుర్గావాహిని, స్వయం సేవక్ సంఘ్, మాతృశక్తి తదితర సంస్థల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు హిందువుల వ్యతిరేకి రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, పంతం గజేంద్ర, దుర్గారావు, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు అల్లూరి లక్ష్మీకాంతారావు, కోట శ్రీకాంత్, భగరంగ్‌దళ్ ప్రతినిధులు మహంకాళి శ్రీరామశర్మ, అల్లూరి శేషుబాబు, మాతృశక్తి, దుర్గావాహిని ప్రతినిధులు చిట్టికుమారి, మల్లేశ్వరి, స్వయం సేవక్ సంఘ్ ప్రతినిధులు వడ్డె కుషి, సమ్మెట సురేష్, మాగంటి అనిల్, బాల పాల్గొన్నారు.

## శ్రీనివాసరావు సేవలు అభినందనీయం

జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనంద్‌కుమార్



శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

చిలకలపూడి(మచిలీపట్నం): సుదీర్ఘకాలంగా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసిన యర్రంశెట్టి శ్రీనివాసరావు సేవలు మరువలేనివని జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈవో సి. ఆనంద్‌కుమార్ అన్నారు. పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన యర్రంశెట్టి శ్రీనివాసరావు వీడ్కోలు కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ సమావేశపు హాలులో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి అనిల్‌కుమార్ మాట్లాడుతూ శ్రీనివాసరావు ఉద్యోగంలో ప్రవేశించిన నాటి నుంచి ఇప్పటి వరకు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందారన్నారు. పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏవీఎస్ శ్రీనివాసరావు మాట్లాడారు. శ్రీనివాసరావు దంపతులను పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.హేమప్రకాష్, చలమలశెట్టి లక్ష్మీశ్రీనివాస్, భోగిరెడ్డి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా తదితరులు పాల్గొన్నారు.

## పంట భూములను పరిశీలించిన ఆర్డీఓ



రైతులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీవాణి

కోడూరు: మండలంలో ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల పంట భూములను బందరు ఆర్డీఓ ఎం.శ్రీవాణి బుధవారం పరిశీలించారు. కోడూరు–ఉల్లిపాలెం, ఉల్లిపాలెం–హంసలదీవి గ్రామాల మధ్య ఉన్న పంట భూములను ప్లాట్లుగా మార్చేందుకు ల్యాండ్ కన్వర్షన్ అవసరమని రైతులు ఆర్డీఓకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఈ భూములను ఆర్డీఓ పరిశీలించి, సమీప రైతుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. భూములపై సమగ్ర నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ శ్రీనివాసరావును ఆదేశించారు. ఆర్ఐ సుభాషిణి, సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యుడు మృతి

- పార్టీ ఓటమిని జీర్ణించుకోలేక కలత
- పార్టీ జెండా కప్పి నివాళులర్పించిన నేతలు, కార్యకర్తలు



కోడూరు: కృష్ణా జిల్లా కోడూరు మండలంలోని మందపాకల సెగ్మెంట్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ పరిశె వెంకటేశ్వరరావు (62) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి చెందడంతో వెంకటేశ్వరరావు తీవ్రమైన కలత చెందాడు. వైఎస్ జగన్ ఓటమిని జీర్ణించుకోలేకపోయాడు. ఈ విషయంపై ఆలోచన పెరగడంతో 20 రోజుల క్రితం వెంకటేశ్వరరావు తీవ్రమైన గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబసభ్యులు విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్చగా వైద్యులు గుండెకు స్టంట్స్ వేశారు. ఇటీవల ఆసుపత్రి నుంచి ఇంటి వచ్చాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి వెంకటేశ్వరరావుకు మళ్లీ తీవ్రమైన గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందాడు. వెంకటేశ్వరరావు వైఎస్సార్‌సీపీకి విధేయుడిగా పనిచేశాడు. గ్రామంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేశాడు. పార్టీ తరుపున ఎంపీటీసీగా పోటీ చేసి గెలిపొందాడు. సర్వసభ్య సమావేశాల్లో సైతం వెంకటేశ్వరరావు గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటిని పరిష్కరించే వరకు అధికారుల చుట్టూనే తిరిగేవాడు. అధికార పార్టీలో ఉన్నప్పటికీ రాజకీయాలకు తావులేకుండా పంచాయతీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. వెంకటేశ్వరరావుపై మృతదేహంపై పార్టీ జెండాను కప్పి పార్టీ శ్రేణులు నివాళులర్పించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యన్నారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావులు వెంకటేశ్వరరావు మృతదేహానికి పూలమాలలతో నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వెంకటేశ్వరరావు మృతిపట్ల సంతాపం తెలిపారు.

### స్వామివారిని దర్శించుకున్న దేవదాయశాఖ అధికారి



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని కృష్ణా జిల్లా దేవదాయశాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించుచున్న ఎన్.సంధ్య బుధవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆమె నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వెంకటేశ్వరరావు, నౌడూరి సుబ్రహ్మణ్యశర్మ, మణిదీప్‌శర్మ స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామి చిత్రపటం, లడ్డూప్రసాదాలు అందించి సత్కరించారు. పలు దేవాలయాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### గ్యాస్ ఏజెన్సీ రద్దు

చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలోని రాజా గారి సెంటర్‌లోని వంకాయల వరదరాజులు అండ్ సన్స్ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీని రద్దు చేసినట్లు హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) సేల్స్ ఆఫీసర్ డి.రాజశేఖర్ తెలిపారు.ఆయన గ్యాస్ ఏజెన్సీని రద్దు చేసినట్లు బుధవారం ప్రకటించారు. అగ్రిమెంట్ లేకుండా నిర్వహించటం, వినియోగదారులు తమ కంపెనీకి చేసిన ఫిర్యాదుల ఆధారంగా రద్దు చేశామన్నారు. ఈ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సేవలు పొందుతున్న వినియోగదారులుఇబ్బందులు పడకుండా నగరంలోని శ్రీనివాస్ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీస్, సోనాక్షి గ్యాస్ ఏజెన్సీ ద్వారా సేవలు అందించటం జరుగుతుందన్నారు. వీవీఆర్ గ్యాస్ ఏజెన్సీ స్థానంలో వారి కార్యాలయాలు ఏర్పాటు చేసి వినియోగదారులకు సేవలు అందిస్తామన్నారు.

### డిజిటల్ క్లాక్ సమర్పణ

కృత్తివెన్ను: గాంధీనగరంలోని శ్రీఅభయ ఆంజనేయస్వామి ఆలయానికి గుడ్లవల్లేరుకు చెందిన శ్రీవిజేత మినీ సూపర్ మార్కెట్ యజమాని బొప్పా వీరవెంకట సుబ్బారావు డిజిటల్ క్లాక్‌ను సమర్పించారు. బుధవారం ఆలయ కమిటీకి ఆయన కుమారులు రాకేష్, రవితేజల చేతుల మీద క్లాక్‌ను అందజేశారు.

### ఎస్వీ రంగారావుకు ఘన నివాళి



కైకలూరు: చలన చిత్ర రంగంలో విశ్వనట చక్రవర్తిగా ఖ్యాతికెక్కిన సామర్ల వెంకటరంగారావు (ఎస్వీ రంగారావు) జయంతి వేడుకలు కైకలూరు–కోరుకొల్లు రోడ్‌లో అభిమానులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎస్వీ రంగారావు కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు చుండూరి రంగారావు అధ్యక్షతన ఎస్వీఆర్ ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. కేక్ కట్ చేసి అభిమానులకు అందించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు చలన చిత్రరంగానికి ఎన్టీఆర్, ఏఎన్నార్ రెండు కళ్లయితే ఎస్వీఆర్ గుండె వంటి వారని కొనియాడారు. ఇండోనేషియా ఫిలిం ఫెస్టివల్‌లో అవార్డు పొంది భారతదేశ చలనచిత్రానికే ఆయన వన్నె తెచ్చారన్నారు. నటుడిగా, నిర్మాతగా, రచయితగా బహుముఖ ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించారన్నారు. ఎస్వీఆర్ 1918 జూలై 3న నూజివీడులో జన్మించారని తెలిపారు. నియోజకవర్గ అసోషియేషన్ గౌరవాధ్యక్షుడు నంబూరి హరికృష్ణంరాజు, అభిమానులు సత్యనారాయణ, భాస్కరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, పట్టుదల, విశ్వాసం విజయానికి మెట్లు



ఎమ్మెల్యే కాగితను సత్కరిస్తున్న పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు

బంటుమిల్లి: ఓటమికి వెరవకుండా, మార్కులు తక్కువ వచ్చాయని, పరీక్షల్లో తప్పామని బాధపడకుండ క్రమశిక్షణ, విశ్వాసం, పట్టుదలతో కృషి చేస్తే విజయం మీ వెంట ఉంటుందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు (కేపీ) అన్నారు. స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల పూర్వ విద్యార్థిగా, ఎమ్మెల్యేగా కాగిత సన్మాన కార్యక్రమం బుధవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టరు సాబూజాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాగిత మాట్లాడుతూ పాఠశాలతో తనకు ఉన్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో నూతనంగా డిజిటల్ ఎడ్యుకేషన్ కోసం ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీ ప్యానల్స్‌ను ఎమ్మెల్యే కాగిత ఆవిష్కరించారు. కాగితకు విద్యాబోధన చేసిన విశ్వనాథ్, జోషి, షౌకత్, శేషగిరి తదితర ఉపాధ్యాయులు, పాఠశాల డైరెక్టరు సాబూజాన్ మాట్లాడారు. తొలుత పాఠశాల వ్యవస్థాపకులు రేచల్ మాథ్యూ, కేకే మాథ్యూ చిత్రపటాలకు కాగిత పూలమాల వేసి నివాళులర్పించి వారితో ఉన్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో ఎమ్మెల్యే కాగితకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కాగితను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు సత్కరించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## బడిఈడు పిల్లలను బడిబయట ఉంచొద్దు

హెచ్‌ఎంల సమావేశంలో ఎంఈవోలు



హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో–1 దుర్గాప్రసాద్

పెడన: బడిఈడు పిల్లలు బడిబయట ఉండకూడని, వారంతా పాఠశాలల్లో ఉంటూ చదువుకునేలా చూడాల్సిన బాధ్యత పాఠశాలల్లోని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులదేనని ఎంఈవో–1 దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని ప్రధానోపాధ్యాయులతో పలు అంశాలపై ఎమ్మార్సీ భవనంలో సమీక్షించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 'నేను బడికి పోతా' అనే కార్యక్రమం ద్వారా బడి ఈడుపిల్లల్ని, బడిబయట పిల్లల్ని అందర్నీ పాఠశాలలో చేర్పే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. నూతనంగా అడ్మిషన్ పొందిన విద్యార్థులను పాఠశాలలో సంసిద్ధం చేసే విధంగా వారికి ఎక్కువగా మౌఖిక అభ్యసనం, కృత్యాధార బోధనను కొనసాగించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం చదువుతున్న ప్రతి విద్యార్థికి ప్రభుత్వం పంపిణీ చేసిన స్టూడెంట్ కిట్‌ను వారికి అందజేసి వారి ద్వారా బయోమెట్రిక్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పౌష్టికంగా, నాణ్యమైనదిగా అందించాలని, హెచ్‌ఎంలు స్వయంగా పరిశీలించాలని సూచించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు కచ్చితంగా నూటికి నూరుశాతం ఇన్ టైంలో వేయడానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. ఎంఈవో–2 హరనాథ్, సీఆర్‌పీలు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## డయేరియాపై తల్లులకు అవగాహన



డయేరియాపై తల్లులకు అవగాహన కల్పిస్తున్న వైద్యబృందం




కొడాలి సచివాలయంలో డయేరియాపై సమీక్ష చేస్తున్న ఎంపీడీవో మారుతీ శేషమాంబ

మచిలీపట్నంటౌన్: పిల్లల్లో వచ్చే అతిసార వ్యాధి లక్షణాలపై ప్రతి తల్లికి అవగాహన ఉండాలని సర్వజన ఆసుపత్రి గైనకాలజిస్టు పి.సుష్మ అన్నారు. ఆసుపత్రిలోని ప్రసవానంతర సేవల యూనిట్ వద్ద బుధవారం తల్లులు, సహాయకులకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు సుష్మ మాట్లాడుతూ పిల్లలు విరోచనాలతో బాధపడితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. వైద్యులను సంప్రదించకుండా నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ప్రమాదం వచ్చే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ పిల్లల ఆరోగ్య పరిరక్షణపై జాగ్రత్త వహించాలన్నారు. విస్తరణాధికారి బి. సాంబిరెడ్డి మాట్లాడుతూ తల్లులు ఆహారం తయారు చేసే ముందు, బిడ్డలకు తినిపించే ముందు, బిడ్డ మల, మూత్ర విసర్జన శుభ్రం చేసిన తరువాత సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. పరిశుభ్రమైన తాగునీటిని ఉపయోగించాలన్నారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా, తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. పిల్లలకు అతిసార లక్షణాలు కనిపిస్తే ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని పట్టించాలన్నారు. వయసును బట్టి తల్లిపాలతో పాటు ఆహారాన్ని ఇవ్వాలన్నారు. అతిసార సోకిన వారికి 14 రోజులపాటు జింక్ మాత్రలను అందించాలన్నారు. బిడ్డకు సంవత్సరం వయసు దాటే లోపు టీకాలను పూర్తి చేయాలన్నారు. జిల్లా ఆరోగ్య విద్య బోధకుడు బి. రాజేంద్రకుమార్, ఆరోగ్య పర్యవేక్షకురాలు జి.సుభాషిణి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

కొడాలి(ఘంటసాల): డయేరియా రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో బి.మారుతీ శేషమాంబ సచివాలయ, పంచాయతీ సిబ్బందికి సూచిచారు. మండలంలోని కొడాలి గ్రామ సచివాలయంలో డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మురుగునీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని పంచాయతీ వారికి సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామాల్లోని ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీయాలని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు చెప్పారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో కేజే శ్రీనివాస్ చంద్, ఈవో నాగమణి, సచివాలయ, పంచాయతీ, వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ ఈకేవైసీ పూర్తి చేయండి

జిల్లా వ్యవసాయాధికారి హబీబ్



వరి పొలాలను సందర్శించిన జిల్లా వ్యవసాయాధికారి హబీబ్, పక్కన ఏడీఏ వెంకటమణి

మండవల్లి: మండలంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కె.హబీబ్, సహాయ వ్యవసాయ సహాయకులు జి.వెంకటమణి, మండల వ్యవసాయాధికారి ఎస్‌కె. జరీనాతో కలిసి పెరికెగూడెం, లింగాల గ్రామాలను బుధవారం సందర్శించారు. పెరికెగూడెం రైతు భరోసా కేంద్రంలో పీఎం కిసాన్, ఈకేవైసీ ఐదు శాతం పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం లింగాల రైతు భరోసా కేంద్రం పరిధిలోని జీలుగ వేసిన పొలాలు, నారుమడి వేసిన, వెదజల్లిన పొలాలలను రైతులతో కలిసి సందర్శించారు. జిల్లా వ్యవసాయాధికారి ప్రకృతి వ్యవసాయం చేసే రైతులతో కలిసి పెట్టుబడి లేని వరి పొలాలను పరిశీలించారు. మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో మట్టి నమూనాలు సేకరించే ప్రక్రియను, విత్తన డీలర్లను, పురుగుమందుల షాపులను తనిఖీ చేశారు. లింగాల, పెరికెగూడెం రైతులు ఓరుగంటి పోతురాజు, మూరాల జగన్మోహనరావు, పరసా వీరాంజనేయులు, ఉడతా మద్దిరామయ్య, జేబీఎస్ సిబ్బంది, వీఏఏలు గోపాల్, వర్మ పాల్గొన్నారు.